క్లుప్తంగా

వైభవంగా అన్నసమారాధన



అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: స్థానిక రాజులపేటలో ఉన్న సుబ్రహ్మ ణ్యేశ్వరస్వామి వారి ఆలయం వద్ద బుధవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి నేపథ్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో ఉండి పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపసర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, మంతెన సాయిలచ్చిరాజు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఇటీవల నరసాపురం వైఎన్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీల్లో భీమవరం సీఎస్ఎన్ కళాశాల విద్యార్థులు గ్రూప్ నృత్యం పోటీల్లో విజేతలుగా నిలిచి రూ.5 వేలు నగదు బహుమతి అందుకోవడం అభినందనీయమని కళాశాల సెక్రటరీ చీడే సత్యనారాయణ అన్నారు. బుధవారం విజేతలను కళాశాలలో ఆయన, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, కో ఆర్డినేటర్ ఆదిరెడ్డి శ్రావణి తదితరులు అభినందించారు.

మండలి చైర్మన్ మోషేనురాజు పరామర్శ



జోనా కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మోషేనురాజు

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పాలపర్తి జోనా ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు పరామర్శించారు. బుధవారం గునుపూడిలోని జోనా నివాసానికి ఆయన వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఏఎస్‌రాజు, బలే యేసుబాబు తదితరులున్నారు.

కరాటే క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: అంతర్జాతీయ కరాటే పోటీల్లో విజేతలుగా నిలవడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. ఇటీవల మలేషియాలో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన ఇమ్మాన్యుయేలు అనాథ ఆశ్రమానికి చెందిన నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీలను బుధవారం ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు పాల్, శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, జ్యోసుల విజయ్ భాస్కర్, గంధం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో వ్యక్తి అదృశ్యం

భీమవరం: స్థానిక టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చినఅమిరంలో టైల్స్ పని నిమిత్తం వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన రేవంత్‌రామ్, బార్వల్‌రామ్ టైల్స్ పనుల నిమిత్తం కొంత కాలం క్రితం వచ్చారని, నవంబర్ 26 నుంచి ఆయన ఆచూకీ లేదని ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై రెహమాన్ తెలిపారు.

నేటి నుంచి 19 వరకు గ్రామ సభలు

మొగల్తూరు: ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఈ నెల 12 నుంచి 19 వరకు సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూల పాణి బుధవారం విలేకరులకు తెలిపారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి మధ్య కాలంలో జరిగిన పనులకు సంబంధించి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 12న మొగల్తూరు, పేరుపాలెం సౌత్, నార్త్, ,కాళీపట్నం తూర్పు,పడమర, రామన్నపాలెం, 14న ముత్యాలపల్లి, 15న కేపీ పాలెం నార్త్, 16న కొత్తోట, వారతిప్ప, పాతపాడు, 18న మోడి, జగన్నాథపురం, 19న కొత్తపాలెం, శేరేపాలెం, కేపీ పాలెం సౌత్, కోమటితిప్ప గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు.

ఆరు నెలలైనా అభివృద్ధి ఊసేలేదు

- ఎక్కడి సమస్యలు అక్కడే
- అమలు కాని హామీలు
- వంతెల అప్రోచ్ రోడ్లపై కదలిక లేదు
- డంపింగ్ యార్డును మరిచిన కూటమి నేతలు
- మంచినీటి సమస్య పరిష్కారానికి ప్రణాళికే లేదు

భీమవరం: 'అధికారంలోకి వచ్చిన వెంటనే భీమవరం నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తాం. ప్రజలకు సమస్యలంటే కలలో కూడా కన్పించకుండా చేస్తాం' అంటూ ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఊదరగొట్టారు. 'జిల్లా కేంద్రం భీమవరం పట్టణంలో డంపింగ్ యార్డు సమస్యను తక్షణం పరిష్కరిస్తాం. జిల్లా కేంద్రంలో చెత్త వేసుకునేందుకు స్థలం లేకపోవడం నాటి అధికార పార్టీ నిర్లక్ష్యమే కారణం. గ్రామాల్లో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తాం' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఎన్నికల సభలు, ఇతర సమావేశాల్లో గొప్పగా ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచిపోయింది. అభివృద్ధి సంగతి అటుంచితే కనీసం ఇచ్చిన హామీల్లో ఒక్కటికూడా పట్టాలెక్కించలేకపోయారు. ఎక్కడి సమస్యలు అక్కడే దర్శనమిస్తుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

హామీలను మరిచారా?

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భీమవరంలో డంపింగ్ యార్డు సమస్యను మర్చిపోయారు. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. భీమవరంలో జనసేన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) డంపింగ్ యార్డు సమస్య, గతంలో ఇచ్చిన హామీలను పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపలేకపోయారు.



యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనకు అప్రోచ్‌రోడ్డు లేక నిరుపయోగంగా ఉన్న దృశ్యం



భీమవరం మండలంలో రోడ్డుపక్కనే చెత్తగుట్టలు

● భీమవరం మండలంలోని తీరప్రాంతాల గ్రామాలు, పట్టణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన యమనదుర్రు డ్రెయిన్‌పై వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణం ఊసే ఎత్తడంలేదు. 2004 సంవత్సరంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్రంధి శ్రీనివాస్ తీర ప్రాంత ప్రజల సౌకర్యార్థం డెల్టా ఆధునికీకరణ పనుల్లో భాగంగా యనమదుర్రు డ్రెయిన్‌పై భీమవరం, గొల్లవానితిప్ప, తోకతిప్ప ప్రాంతాల్లో వంతెనలు నిర్మించారు. శ్రీనివాస్ పదవీ కాలం పూర్తవడంతో వంతెనలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అనంతరం పదేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన పులపర్తి అంజిబాబు అప్రోచ్ రోడ్ల నిర్మాణంలో ఎటువంటి ప్రగతి సాధించలేకపోయారు. 2019లో వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన గ్రంధి శ్రీనివాస్ అప్రోచ్ రోడ్ల నిర్మాణంపై దృష్టిపెట్టారు. అప్రోచ్‌రోడ్ల నిర్మాణానికి సుమారు రూ.36 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అయితే టెక్నికల్ కారణాల వల్ల నిర్మాణం పూర్తికాలేదు. 2024లో ఎన్నికల్లో కూటమి నాయకులు అప్రోచ్ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అప్రోచ్ రోడ్ల నిర్మించాలని గళమెత్తారు. ఇంకేముంది అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తయినట్టేనని కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. అయితే అప్రోచ్‌ల నిర్మాణంపై ఎటువంటి కదలికలేదు.

● నియోజకవర్గంలోని గ్రామాలకు మంచినీటి కొరత లేకుండా చేస్తామని హామీ ఇచ్చినా.. ఇందుకు సంబంధించిన ఎటువంటి ప్రణాళిక ఇంతవరకు సిద్ధం కాలేదు. డ్రెయిన్ల ప్రక్షాళన, కొత్తగా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు లేదు. ఈ నేపథ్యంలో కూటమి నాయకులు మాటలే తప్ప చేతల్లో ఏమి లేదంటూ సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అప్రోచ్‌లు లేక అవస్థలు



యనమదుర్రు డ్రెయిన్‌పై వంతెనలు నిర్మించి ఏళ్లు గడిచిపోతున్నా అప్రోచ్ రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తీరప్రాంతంలోని గ్రామాలకు వంతెనల మీదుగా దగ్గరమార్గం ఏర్పడుతుందని ఆశించాం. అయితే అప్రోచ్ రోడ్లు లేకపోకపోవడంతో చుట్టు తిరిగి అదనపు దూరం ప్రయాణించి రావాల్సి వస్తుంది.

– పెనుమాక నర్సింహస్వామి, గొల్లవానితిప్ప

మాటలకే పరిమితం



వంతెనలకు అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనలు నిరూపయోగంగా మారాయి. అప్రోచ్ రోడ్ల ఆవశ్యకతను ఎమ్మెల్యే రామాంజనేయులు అసెంబ్లీలో ప్రస్తావిస్తే పనులు జరిగిపోతాయని ఆశించాం. పనుల్లో కదలిక లేదు. కూటమి పార్టీ నేతలు మాటల గొప్ప తప్ప చేతలు కనిపించడంలేదు.

– తిరుమాని ధనుంజయ, దొంగపిండి, భీమవరం మండలం

టెలీకాలింగ్ ద్వారా ఉచిత హోమియో వైద్య శిబిరం

పాలకోడేరు: పాలకొల్లుకు చెందిన ప్రముఖ హోమియో వైద్య నిపుణుడు కోసూరి రామకృష్ణానంద రాజు శ్రీ రామకృష్ణ పరమహంస హోమియోపతి హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం వెండ్రలో ఉచిత హోమియో మొబైల్ వైద్య శిబిరం నిర్వహించారు. 22 మందికి టెలీకాలింగ్ ద్వారా రోగుల వ్యాధులు తెలుసుకుని, దీర్ఘ కాలిక వ్యాధులకు సైతం తగిన సలహాలు సూచనలు ఇచ్చి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు

భీమవరం: కేరళలోని కమ్యూనిస్టు వామపక్ష ప్రభుత్వంపైనా, అక్కడి ప్రజలపైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు వైఖరి తగదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ అన్నారు. కేరళ రాష్ట్రానికి కేంద్రం ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా రైతు, కార్మిక ప్రజాసంఘాల పిలుపులో భాగంగా స్థానిక ప్రకాశం చౌక్ సెంటర్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కేరళ రాష్ట్రానికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా ఆర్థికంగా దెబ్బతీయాలని చూస్తుందని విమర్శించారు. వయనాడ్ ప్రాంతంలో వరదలకు వేలాదిమంది చనిపోయినా, వేలకోట్ల రూపాయల నష్టం వాటిల్లినా కేంద్రం స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ధారపోస్తూ, ప్రజలపై బారాలు వేస్తూ రాష్ట్రాల హక్కులను కాలరాస్తోన్న బీజేపీ, మోదీ విధానాలను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడారు. రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల నాయకులు బి.వాసుదేవరావు, బి.జార్జి, ఎం ఆంజనేయులు, ఎం వైకుంఠరావు, టి.రాము, డి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రధాన సమస్యలకు పరిష్కారమేదీ?

ఆకివీడు: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా నియోజకవర్గంలోని ప్రధాన సమస్యల పరిష్కారం ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉంది. ప్రజలకు తీవ్ర ఇబ్బంది కల్గిస్తున్న మంచినీటి సమస్య, డ్రెయినేజీ, రహదారుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉన్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పల్లెల్లోనూ, మండల కేంద్రాలు, నగర పంచాయతీ పరిధిలో మంచినీటి సమస్య జఠిలంగానే ఉంది. చాలా పంచాయతీల్లో కనీసం ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక వేసి, మంచినీటి ఫిల్టర్ చేసే పరిస్థితి కూడా లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రధాన పంట కాల్వ వెంకయ్య వయ్యేరులో మురుగునీటి ప్రవాహాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరగలేదంటున్నారు. పంట కాలువల్లోకి మురుగునీరు, చేపలు, రొయ్యల చెరువుల నీరు చొచ్చుకురావడంతో మంచినీటి వ్యవస్థ చిన్నాభిన్నమైంది. పంట కాలువల్లో సెలనిటీ ప్రభావం పెరిగిపోతుందని ఆవేదన చెందుతున్నారు. నగర పంచాయతీ పరిధిలోని గంగానమ్మకోడు అభివృద్ధి జరగలేదు. గతంలోనిర్మించిన మూలలంక పంట కాల్వపై నిర్మాణం, అదేవారి బోదెకు నిర్మించిన బాక్సు డ్రెయిన్‌లలో పూడికలు పెరిగిపోవడంతో దోమలకు నిలయాలుగా మారాయి. నియోజకవర్గంలోని పలు రహదారులు కూడా అధ్వానంగానే ఉన్నాయి. తూట్లు పడ్డ రహదారులకు మాట్లు వేస్తున్నా ఫలితం దక్కడంలేదని వాపోతున్నారు. నియోజకవర్గంలోని పలు ప్రధాన రహదారుల అభివృద్ధి జాడేలేదు.

ఆక్వా రైతుల ఊసే ఎత్తని సర్కార్

వరి రైతులు, ఆక్వా రైతుల కష్టాలుక కూటమి పాలనలో ఎక్కువయ్యాయి. ఖరీఫ్ సాగు ప్రారంభంలో రైతు భరోసా పథకం రూ. 13,500 చెల్లించలేదు. కూటమి అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం రూ. 20 వేలు చెల్లిస్తామని చెప్పిన హామీ నెరవేరలేదు. ఆక్వా రైతులకు విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని కూటమి ఎన్నికల వాగ్దానం నీటి బుడగగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. యూనిట్ ఛార్జి రూ. 3.85 పైసలుండగా, రూ. 1.50 పైసలకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తగ్గిస్తామని చెప్పి ఆరు నెలలైనా ఇంతవరకూ అతీగతీలేదని వాపోతున్నారు. వీటికి తోడు యూజర్ ఛార్జీలు, బొగ్గగనుల ఛార్జీల పేరుతో అదనపు వసూళ్లు ప్రారంభించారని ఆక్వా రైతులు ఆవేదన చెందుతున్నారు.



ఆకివీడు: అభివృద్ధికి నోచుకోని నగర పంచాయతీ పరిధిలో గంగానమ్మకోడు ప్రధాన మురుగు కాలువ



భీమవరం-ముదినేపల్లి రాష్ట్ర రహదారిలో కోపల్లె వంతెన

రైతు భరోసా లేదు



రైతు భరోసా పథకం సొమ్ము కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నాము. ఖరీఫ్ సాగు పూర్తి అయినా నేటికీ సొమ్ము ఖాతాల్లో జమకాలేదు. గత ప్రభుత్వం కంటే తాము అధికారంలోకి వస్తే రూ. 20 వేలు ఇస్తామన్నారు. కనీసం పథకాన్ని కూడా అమలుజేయలేదు. కౌలు రైతులమైన మేము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాము.

– బుంగా భూమయ్య, కౌలు రైతు, అజ్జమూరు, ఆకివీడు మండలం.

అమ్మ ఒడి కోసం ఎదురు చూపులు



అమ్మ ఒడి సొమ్ము కోసం ఎదురు చూస్తున్నాం. మా పిల్లలిద్దరూ హైస్కూల్‌లో చదువుతున్నారు. ఇద్దరు పిల్లలకూ అమ్మ ఒడి ఇస్తానని కూటమి ప్రభుత్వం చెప్పింది. హామీ అమలుజేస్తారని ఎదురు చూస్తున్నాం. ఆర్నెలలైనా నేటికీ ఒక్క పిల్లాడికి కూడా అమ్మ ఒడి రాలేదు.

– బలే మార్తమ్మ, మోగల్లు, పాలకోడేరు మండలం

కరెంట్ చార్జీలను తగ్గించాలని ధర్నా



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

కాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జీల వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుఉందని సీపీఎం మండల కార్యదర్శి గొర్ల రామకష్ణ ఆవేద వ్యక్తం చేశారు. కాళ్ల మండలం ప్రాతాళ్లమెరక గ్రామంలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో బుధవారం కరెంటు బిల్లు పెంచడానికి నిరసనగా కరెంట్ బిల్లు దగ్ధం చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు గారు 2000 సంవత్సరంలో కరెంటు చార్జీలు పెంచినప్పుడు జరిగిన పరిణామాలు గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. పెరుగుతున్న చార్జీలతో ప్రజలు కరెంటు బిల్లు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల్లో ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ట్రూ అప్ చార్జీలని విరమించుకోవాలి అని అన్నారు. కార్యక్రమంలో తిరుమల శ్రీను, గండికోట వెంకటేశ్వరరావు, దాసి బాలయ్య, తిరుమని సుబ్బారావు, తిరుమాని రామలక్ష్మి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ

కాళ్ల: వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కాళ్ల మండలం పెద అమిరం పార్టీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ తక్షణమే రైతుకు పెట్టుబడి సాయం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వాలి డిమాండ్ చేశారు.సూపర్ సిక్స్ హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ధాన్యానికి కనీస మద్దతు ధర ఇవ్వాల్సిందేనని, దళారీ వ్యవస్థను తొలగించాలని డిమాండ్ చేశారు తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తేమ లెక్కలతో రైతులను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని హితవు పలికారు. ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని కోరారు. రైతుపై అదనపు భారం మోపే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ నిలబడుతుందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రైతులకు ఎంతో మేలు చేశారని గుర్తు చేశారు. రైతులకు పెట్టుబడి సాయం అందజేసి రైతులకు అండగా నిలిచేవారని స్పష్టం చేశారు. ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్లో వినతి పత్రాలు ఇచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. శ్రేణులంతా పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు నంద్యాల సీతారామయ్య, వేగేశ్న జయరామ కృష్ణంరాజు, గణేశ్న రాంబాబు, మంతెన సునీల్ కుమార్, వర్మ, పెనుమత్స రంగరాజు,వేగేశ్న నాగరాజు, సాంసంన్ పల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పెద అమిరం పార్టీ కార్యాలయంలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

సామూహిక భగవద్గీత పారాయణం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం, చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం (త్యాగరాజ భవనం)లో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ ఆచార్యులు బ్రహ్మచారిణి ఈశాని చైతన్య మాట్లాడుతూ స్వామి తపోవనం మహారాజ్ జయంతి, గీతామాత షోడ శోపచార పూజ, అనంతరం భగవద్గీత 18 అధ్యాయాలు పారాయణం 200 మంది మహిళలచే నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ అధ్యక్షుడు మడిపల్లి శేఖర్, కోశాధికారి గ్రంధి కుమార వెంకటేశ్వర ప్రసాద్, సభ్యులు, మడిపల్లి నాగమణి, నూలి లత, సంకా శారద, తమ్మన రామలక్ష్మి, సుశాంత్ వర్మ, తమ్మన స్వర్ణ,అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా గీతా జయంతి

ఉండి: విశ్వహిందూపరిషత్, శ్రీకృష్ణచైతన్యానంద ఆశ్రమం ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉండి కొత్త పేటలోని శ్రీకృష్ణాచైతన్యానంద ఆశ్రమం నుంచి గ్రామంలోని ప్రధాన రహదారుల్లో నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో వలంటీర్‌లు, కార్యకర్తలు భగవద్గీత నుంచి 40 శ్లోకాలను పాడించి దానిని వివరించారు. విశ్వహిందూపరిషత్ నాయకుడు నల్లా కిరణ్‌ప్రసాద్, గుండాబత్తుల సుబ్బారావు, ఖండాపు శ్రీనివాసరావు, దాసరి వరదరాజులు,డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నగర సంకీర్తన నిర్వహిస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ వాడకం అనర్థం

భీమవరం(ప్రకాశం చౌక్): ప్లాస్టిక్ వాడకం అనర్థం, ప్రాణాంతకమని స్థానిక మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో బుధవారం సంత మార్కెట్‌లో తనిఖీలు, ప్రచారం చేశారు. కమిషనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గుడ్డ సంచులను వాడాలని సూచించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం అందరి బాధ్యతన్నారు. మానవత ప్రసాద్ సౌజన్యంతో గుడ్డ సంచులు పంపిణీ చేశారు. అనంతరం సంత మార్కెట్ నుంచి మారుతి టాకీస్ సెంటర్, కొత్త బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, అల్లు శ్రీనివాస్, మెప్మా కార్యకర్తలు, వార్డు సెక్రటరీలు పాల్గొన్నారు.



భీమవరంలో ప్లాస్టిక్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

మొగల్తూరు: ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 13 నుంచి 2025 జనవరి 3 తేదీ వరుకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు, రీ సర్వే సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత వ్యక్తులు దరఖాస్తులు అందజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 13న కొత్తపాలెం, శేరేపాలెం, 17న పేరుపాలెం నార్త్, సౌత్, 18న కేపీపాలెం నార్త్, సౌత్, 19న మొగల్తూరు 4 సచివాలయాల పరిధిలోనూ, 20న రామన్నపాలెం 2 సచివాలయాల పరిధిలోనూ, 21న మోడి, వారతిప్ప, 27న కొత్తోట, ముత్యాలపల్లి, 28న కాళీపట్నం తూర్పు, పడమర, 2025 జనవరి 3న జగన్నాథపురం, పాతపాడు, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా గ్రామాలకు చెందిన రైతులు, ప్రజలు ఈసదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు.